వరివడిగా పంట నష్టం అంచనా

- మంత్రి రాజా ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అధికారులు
- రైతులతో మాట్లాడి వివరాల నమోదు
- యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ


కోదాడలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు

తుని: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన పంట నష్టం, విద్యుత్, ఉద్యాన పంటలు వివరాల సేకరణలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. మిచాంగ్ తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వరద నీటి ఉధృతికి వేలాది ఎకరాలు వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు అన్ని శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాల పరిధిలో ఏ మేర నష్టం జరిగిందో పరిశీలించి నివేదిక రూపకల్పనలో నిమగ్నమయ్యారు. రెండు రోజుల వ్యవధిలోనే రైతులకు భరోసా కల్పించారు. రైతులకు నష్టం లేకుండా పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు.

10,500 ఎకరాల్లో...

తుని నియోజకవర్గం పరిధిలోని తొండంగి, కోటనందూరు, తుని మండలాల్లో సుమారు 10,500 ఎకరాల్లో వరిపంటకు నష్టం కలిగింది. ఉద్యాన శాఖకు సంబంధించి 45 హెక్టార్లలో అరటి, కూరగాయలు, బొప్పాయి పంట దెబ్బతింది. విద్యుత్ శాఖకు సంబంధించి 60 స్తంభాలు, 18 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వరి పంట నష్టం అంచనా వేసేందుకు ఏడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అధికారులు మండలాల వారీగా క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు. పలు గ్రామాల్లో ఉద్యాన పంటలను ఉద్యానశాఖ అధికారి విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం దెబ్బతిన్న పంటలను ఏ విధంగా కాపాడుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. ట్రాన్స్‌కోకు సంబంధించి తొండంగి మండల పరిధిలో ఎక్కువ నష్టం జరిగింది. విద్యుత్ శాఖ సబ్ డివిజన్ అధికారి పర్యవేక్షణలో 60 స్తంభాలు, 18 ట్రాన్స్ ఫార్మర్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి విద్యుత్ సరఫరా అందించారు. గత ప్రభుత్వ హయాంలో నష్టం అంచనా వేయడానికి నెలలు సమయం తీసుకునేవారు. ఇందుకు భిన్నంగా రోజుల వ్యవధిలోనే నష్టాన్ని అంచనా వేయడం ఇదే తొలిసారి. ఏ రైతుకూ నష్టం లేకుండా చూడాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు వంద శాతం అమలవుతున్నాయి.


ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ విజయలక్ష్మి

త్వరతగతిన నివేదిక

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మిచాంగ్ తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టంపై నివేదికను తయారు చేస్తున్నాం. పంట నష్టం అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులను కలిసి తడిసిన పంటను ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

పంట నీట మునిగింది



నా పేరు చింతకాయల జగన్నాథ రావు, మాది కోటనందూరు మండలం అల్లిపూడి. నేను మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట పక్వానికి చేరడంతో తుపాను హెచ్చరికలు ఉన్నా పంట కోయాల్సి వచ్చింది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి పంట నీట మునిగింది. వ్యవసాయశాఖ అధికారులు సూచనల మేరకు కొంత వరకు పంటను రక్షించుకున్నాం. వర్షం నీరుతో పాటు వరదనీరు చేరడం వలన నష్టం జరిగింది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వజ్రకూటంలో వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: మండలంలోని వజ్రకూటంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం కన్నులపండువగా జరిగింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

మండల ప్రత్యేకాధికారిగా బాలామణి

శంఖవరం: మండల ప్రత్యేకాధికారిగా ఎం.బాలామణి నియమితులయ్యారు. ఆమె పెద్దాపురం డీఎల్‌డీపీఓగా పని చేస్తున్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ఆమెకు ఎంపీడీఓ, తహసీల్దార్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. అభివృద్ధి పనులు, పథకాలపై చర్చించారు. తుపాన్ కారణంగా నష్టపోయిన పంటలను అంచనా వేయాలని సూచించారు. అనంతరం కత్తిపూడి శ్రీసీతారామాంజనేయ రైస్ మిల్లును ఆమె పరిశీలించారు.

క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా' పై అవగాహన

జగ్గంపేట: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని మండల సచివాలయాల కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా అన్నారు. జగ్గంపేట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రాపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్రీడలపై ఆసక్తి గల యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పంచాయతీ ఈఓ గణేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ ఘటనలో ఆదే గ్రామానికి చెందిన బత్తిన శివపై పరారీ కేసు నమోదు చేశారు. చింతలూరులో తోలెం సరస్వతిని అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై బైండోవర్ కేసు నమోదు చేసి, ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై బి. శ్రీనివాసరావు, సెబ్ హెచ్‌సీలు కృష్ణార్జున, వెంకన్నదొర తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన పారదర్శకంగా చేయాలి

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనను అధికారులు పారదర్శకంగా చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో కులగణనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎటువంటి తప్పులు, అవకతవకలు లేకుండా కులగణన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంఈఓ బి.గౌరమ్మ, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తుని: జేసీఐ జ్యూవెల్స్ అధ్యక్షుడిగా బడారు సంతోష్ ఎన్నికయ్యారు. పట్టణంలో శుక్రవారం జేసీఐ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ సెక్రటరీగా బండారు సంపత్, ట్రెజరర్‌గా బండారు ప్రదీప్, కార్యవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జేసీఐ ఇండియా జోన్-4 నాయకులు నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఐ జోన్-4 అధ్యక్షుడు గొంప సురేష్, నేషనల్ ట్రైనర్ జ్యోతి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూకమ్మ చెరువుకు గండి


తొండంగి నూకమ్మ చెరువుకు పడిన గండి

తొండంగి: హెచ్.కొత్తూరు–తొండంగి రహదారిలో నూకమ్మ చెరువుకు గండి పడింది. నీరు పొంగి పొర్లడంతో సమీపంలో పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. తుపాను ప్రభావంతో పంపా రిజర్వాయర్ నుంచి మిగులు జాలలను దిగువకు విడుదల చేయడంతో ఆ నీటి ఉధృతి గ్రామాల్లోని చెరువులు, పొలాలపై పడింది. ఈ నేపథ్యంలో నూకమ్మ చెరువుకు గండి పడి పొలాలు ముంపుబారిన పడడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

సమస్యను పరిష్కరించాలని వినతి

గండేపల్లి: తమ సమస్యను పరిష్కరించాలని నీలాద్రిరావుపేట గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి తరంగిణికి వినతి పత్రం అందజేశారు. వర్షం వచ్చిన ప్రతిసారీ వీధుల్లో నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షానికి తమ ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర వస్తువులతో పాటు ఫ్రిజ్, టీవీ దెబ్బతిన్నాయన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

పథకాల అమలులో అశ్రద్ధ తగదు

ప్రత్తిపాడు: ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు, సిబ్బంది అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు హెచ్చరించారు. ప్రత్తిపాడు వైఎస్సార్ కాంతిపథం కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పథకాల అమలులో పారదర్శకత లోపించినా, నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. ఆధార్ సెంటర్లలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు, సర్వీసులు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథం, మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్. నాగేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి-2 వై.అచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ఏలేశ్వరం: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి అన్నారు. మండలంలోని మర్రివీడులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. ప్రతి పేదవాడికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. తొలుత గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే బోర్డును ప్రారంభించారు. గ్రామ ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లెల బ్రహ్మాజీరావు, నానిశెట్టి లోవరాజు, సఖిరెడ్డి బుజ్జి, కస్తూరి అప్పలరాజు, బంటుపల్లి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తొండంగి: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని రావికంపాడులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు అంగుళూరి సుశీల, దడాల విజయ్, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్ మేడిశెట్టి మంగాయమ్మ పాల్గొన్నారు.


మర్రివీడులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎస్.అన్నవరం వై ఏపీ నీడ్స్ జగన్

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం సచివాలయం-1లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ పాల్గొన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగుర వేశారు. ఇంటింటా పర్యటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి వాసు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్.అన్నవరంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు ఆమోదం


సమావేశంలో అజెండా చదివి వినిపిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర పంచాయతీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గతంలో కేటాయించిన రూ.కోటి నిధులకు సంబంధించిన పనులను కాంట్రాక్టర్ చేపట్టకపోవడంతో ఆ పనులను రద్దు చేసి నూతనంగా చేపట్టే పనులకు కౌన్సిల్ అమోదం తెలిపింది. ఈ సందర్భంగా 4వ వార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి మాట్లాడుతూ గతంలో అమోదించిన పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో పగలు వీధి దీపాలు వెలుగుతూ రాత్రులు వెలగడం లేదని 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి ఆరోపించారు. పట్టణ ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందజేయాలని కోరారు. కౌన్సిలర్ల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్

కోటనందూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను పారదర్శకంగా గుర్తించాలని వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏఓ చంద్రశేఖర్ అధ్యక్షతన తుపాను నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనలపై తడిచిన, నీట మునిగిన పంటలను పరిశీలించి గుర్తించాలన్నారు. నష్టం జరిగిన ఏ రైతుకూ అన్యాయం జరగడానికి వీల్లేదన్నారు. గతేడాది ఎకరాకు రూ.6 వేలు ఇచ్చిన నష్టపరిహారం ప్రస్తుతం రూ.10 ఇచ్చేలా మంత్రి దాడిశెట్టి రాజా సీఎం జగన్‌తో చర్చించారన్నారు. నష్టం జరిగిన రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందనే విషయంపై రైతులకు భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ శనివారం నుంచి గ్రామాల్లో పంట నష్టంపై సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఏబీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, తహసీల్దార్ కుశరాజు, ఏఈఓ శివకుమారి పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో నీట మునిగిన వరి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఆహార, ఉద్యాన, వాణిజ్య పంటలకు ఎంత మేర నష్టం వాటిల్లిందో అంచనా వేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం. బాలామణి, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, ఏఓ పి.గాంధీ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటోందని మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని లింగంపర్తి, తిరుమాలి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరిపొలాలు, అరటి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా తోడ్పాటును అందిస్తుందన్నారు. పంట నష్టపోయిన రైతులు ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ముంపునకు గురైన పొలాల్లో మురుగునీరు పోయేలా కాలువలు తీసుకోవాలన్నారు. ధాన్యం మొలకెత్తకుండా 5 శాతం ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ చిన్నారావు, ఏఓ బి.జ్యోతి, ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన అధికారులు

గోకవరం: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం జిల్లా రిసోర్స్ సెంటర్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు జయరామలక్ష్మి పరిశీలించారు. పలు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్టంపోయిన రైతుల వివరాలను వీఆర్వోలు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది నమోదు చేసి నష్టం అంచనా వేస్తారన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయశాఖ అధికారి రాజేశ్వరి ఉన్నారు.


శంఖవరంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

70 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం

రౌతులపూడి: మిచౌంగ్ తుపాన్ కారణంగా మండలంలో సుమారు 70 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానవనశాఖ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గుమ్మరేగుల, ఉప్పంపాలెం, బంగారయ్యపేట, రౌతులపూడి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. వనదుర్గ ఆలయం దిగువన గల మండపంలో ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు అమరేశ్వర అవధాని, ఉపాధ్యాయుల రమేష్, ఆలయ అర్చకులు వంశీ, ప్రయాగ రాంబాబు, వ్రతపురోహితులు కూచుమంచి ప్రసాద్, దేవులపల్లి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. మొత్తం 50 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమం కోరుతూ చండీహోమం

జగ్గంపేట: నియోజకవర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శుక్రవారం చండిహోమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో రుత్వికులు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా హోమం జరిగారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఆయన సతీమణి వేణి, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తండ్రి జ్యోతుల రామస్వామి, ఎంపీపీలు తోటరవి, చలగళ్ల దొరబాబు, అత్తులూరి నాగబాబు, సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మిరఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.


జగ్గంపేటలో చండీహోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

రోటరీక్లబ్ సేవలు అభినందనీయం

తుని: పేదలకు తుని రోటరీక్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు అన్నారు. తుని రోటరీక్లబ్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీక్లబ్ భవనంలో విలేకర్లతో మాట్లాడారు. అనంతరం పలు సేవాకార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కోటనందూరు మండలం బొద్దవరం ఉన్నత పాఠశాలకు ఆరు బెంచీలు, తుని బ్యాంక్‌కాలనీ సరస్వతి శిశుమందిర్‌లో రూ.2.50 లక్షలతో నిర్మించిన మరుగు దొడ్లు, పెంటకోట రోడ్డులోని వృద్ధాశ్రమానికి ఫిజియోథెరిపీ మెషీన్, రైతులకు పురుగు మందులు పిచికారీ యంత్రం, రోటరీ సహాయంతో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. తుని రోటరీక్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి కిశోర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ గొల్లపూడి బుచ్చిరాజు, కోశాధికారి గణేష్, జిల్లా కార్యదర్శి సీహెచ్ మంగరాజు, వీవీ రాజు, శెట్టి నాగభూషణం, ప్రసాద్, నాగిరెడ్డి, రామకృష్ణ, నాగేశ్వరరావు, సత్యసాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


తునిలో వృద్ధాశ్రమానికి ఫిజియోథెరపీ మెషీన్‌ను అందజేసిన రోటరీ జిల్లా గవర్నర్ సుబ్బారావు

చట్టాలపై అవగాహన అవసరం

కోటనందూరు: పల్లెల్లో పాలన సక్రమంగా జరగాలంటే పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన అవసరమని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) పథకంలో భాగంగా పరిపాలనపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్టర్ ఆఫ్ ట్రైనర్ (ఎంటీటీ)లు జి.అరుణ్‌కుమార్, బి.రాజానాగేశ్వరరావు పంచాయతీరాజ్ వ్యవస్థ ఎలా మొదలైంది, పంచాయతీల విధులు, బాధ్యతలు, ఆదాయ వనరులు, గ్రామ సభలు, సమావేశాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తుని: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రోటరాక్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో శనివారం రోటరీక్లబ్ ఆఫ్ యంగ్ లీడర్స్, సబల సభ్యులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలను పర్యావరణ సమస్య వేధిస్తోందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా సభ్యులు ప్రాజెక్టులు చేయాలని సూచించారు. విద్యార్థులు రోటరాక్టులో చేరడం ద్వారా సేవాగుణాన్ని అలవార్చుకోవడం, పరిపాలన నైపుణ్యం, ఒకరికొకరు సమన్వయంతో మెలగడం వంటివి మెరుగుపర్చుకోవచ్చన్నారు. సమాజంలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బుచ్చిబాబు, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

తుని రూరల్: మండలంలో సుభద్రయ్యమ్మపేటకు చెందిన ఓ గర్భిణి 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. డి.పోలవరం శివారు సుభద్రయ్యమ్మపేటకు చెందిన గర్భిణి కె.పావనికి గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. తునికి చెందిన 108 అంబులెన్స్ మరో కేసులో ఉండడంతో అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన 108 సిబ్బంది సుభద్రయ్యమ్మపేటకు చేరుకున్నారు. అప్పటికే నొప్పులు అధికమవ్వడంతో తుని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో పావనికి సుఖప్రసవం జరిగింది. ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని 108 ఈఎంటీ శ్రీనివాస్, పైలెట్ నాగార్జున తెలిపారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తల్లీబిడ్డను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.


వాహనంలో జన్మించిన బిడ్డను చూపుతున్న సిబ్బంది

అన్నదానం

ఏలేశ్వరం: పట్టణంలోని తోటవీధిలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. కనకదుర్గమ్మ పండగను పురస్కరించుకుని స్థానిక తూరోతు గొల్లబాబు దంపతుల ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు సామంతుల సూర్యకుమార్, సిరిపరపు రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలని వినతి


ప్రత్తిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ప్రత్తిపాడు: మిచాంగ్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి, అరటి, మినుము, పత్తి పంటలు దెబ్బతిని రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాకే కృష్ణారావు, పార్టీ నాయకులు కందా వీరాస్వామి, ఇంటి బాబూరావు, మదినే బాబ్జి, చింతాకుల రామకృష్ణ పాల్గొన్నారు.

శివలింగం ఏర్పాటు

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో తాండవనది ఒడ్డున శుక్రవారం శివలింగాన్ని ఏర్పాటు చేశారు. కార్తిక మాసంతో పాటు ఇతర సమయాల్లో భక్తులు తాండవ నదిలో స్నానం చేసి శివలింగాన్ని దర్శించి పక్కనే ఉన్న కాశీజ్ఞానాశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించేలా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శివాలయానికొచ్చే భక్తులంతా విధిగా శివలింగాన్ని దర్శించాలని విజ్ఞప్తి చేశారు.


బొద్దవరంలో తాండవ నది ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగం